# సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ၊ 11 ၊ ఏప్రిల్ ၊ 2025






**అసాంఘిక అడ్డాగా..**

వీకెండ్ సరదా కోసం నిర్మించుకుంటున్న ఫాంహౌస్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. 8లో▸



**మరోసారి రణరంగం**

జల్‌పల్లి మున్సిపాలిటీ పిట్టలగూడలోని భూములు వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. 8లో▸



**సెక్షన్ 164 విధింపు**

తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్షన్ 164 అమలు చేస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. 8లో▸

## న్యూస్‌రీల్

### మామిడి రైతుల ప్రయోజనాలే ముఖ్యం



బాటసింగారం మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్:** పండ్ల మార్కెట్‌కు వచ్చే మామిడి రైతులకు గిట్టుబాటు ధర అందిస్తూ వారి ప్రయోజనాల కోసమే మార్కెట్ కమిటీ పనిచేస్తోందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మామిడి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో బాటసింగారం పండ్ల మార్కెట్‌లో జరుగుతున్న మామిడి పండ్ల క్రయవిక్రయాలను గురువారం పాలకవర్గం సభ్యులు, అధికారులతో కలిసి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. మామిడి మార్కెట్ యార్డు మొత్తం తిరిగి రైతుల సమస్యలు, క్రయవిక్రయాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌కి వచ్చిన రైతుల సమస్యలు తెలుసుకొని వారి సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది కంటే ఈ సంవత్సరం మామిడి దిగుబడి అధికంగా ఉందని, మార్కెట్‌కి వచ్చే రైతులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. రైతులకు మంచి గిట్టుబాటు అందించేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. రోజుకు 800 వాహనాలు మార్కెట్‌కి వస్తున్న తరుణంలో ట్రాఫిక్‌కి ఇబ్బంది కలగాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మార్కెట్ సెక్రటరీ ఎల్.శ్రీనివాస్, డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, అంజయ్య, నవరాజ్, రఘుపతి రెడ్డి, నరసింహ, జైపాల్ రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, గణేశ్‌నాయక్, వెంకటేశం గుప్తా, ఇబ్రహీం పాల్గొన్నారు.

### మతోన్మాదం నుంచి ప్రజలను కాపాడుకోవాలి



షాబాద్‌లో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**షాబాద్:** మతోన్మాదం నుంచి ప్రజలను, బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. పార్టీ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామికవాదులు, ప్రశ్నించే నాయకుల మీద దాడులు.. హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలను సంప్రదించకుండానే వక్ఫ్ బోర్డు చట్ట సవరణ చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఉత్తరాది రాష్ట్రాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సీబీఐ, ఈడీ లాంటి రాజ్యాంగ సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్న పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నక్కల జంగయ్య, నాయకులు శ్రీశైలం, రఘురాం, రుక్కయ్య, రఘు, మధు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### 21 నుంచి అరుదైన నాణేలు, కరెన్సీ ప్రదర్శన



**చార్మినార్:** ఈ నెల 21, 22, 23 తేదీల్లో పాతబస్తీలోని ఉర్దూ ఘర్‌లో అరుదైన అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువుల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. అరుదైన నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌ల ప్రదర్శన చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి ఈ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే ఈ అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ ఎగ్జిబిషన్ అందరికీ అందుబాటులో ఉంటుందని.. తమకు కావాల్సిన వాటిని ఖరీదు చేయవచ్చని, అలాగే తమ వద్ద ఉన్న పురాతన నాణేలను విక్రయించవచ్చని సొసైటీ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తెలిపారు. నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌లతో పాటు ఇతర పురాతన వస్తువుల మిశ్రమ కలయిక వస్తువులను ఎగ్జిబిషన్‌లో సందర్శకులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

# బియ్యం లేవ్!

**రేషన్ షాపుల్లో నిండుకున్న నిల్వలు**

- పూర్తిస్థాయిలో దుకాణాలకు చేరని కోటా
- తొలి విడతలో వచ్చినవి వచ్చినట్లే పంపిణీ
- దుకాణాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- ఏం చేయలేక చేతులెత్తేస్తున్న డీలర్లు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో సన్న బియ్యం కోసం క్యూలో నిల్చున్న లబ్ధిదారులు

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** గండిపేట మండలం మణికొండలోని షాప్ నంబర్ 23లో బియ్యం స్టాక్ లేక గురువారం మూతపడింది. నార్సింగి -1 రేషన్ షాపులోనూ ఇదే పరిస్థితి. మంచిరేవుల రేషన్‌షాపు నంబర్ 15100020లో పాతదొడ్డు బియ్యం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సన్న బియ్యం ఇప్పటికీ సరఫరా కాలేదు. ఖానాపూర్, నార్సింగి, బండ్లగూడ, మణికొండ, కోకాపేట్, మంచిరేవుల, కిస్మత్‌పూర్, గంధంగూడ, హిమాయత్‌సాగర్, వట్టినా గులపల్లి, బండ్లగూడ జాగీర్, నెక్నాంపూర్, పుప్పాల్‌గూడ రేషన్‌షాపుల్లో బియ్యం నిల్వలు పూర్తిగా నిండుకున్నాయి. లబ్ధిదారుల నిష్పత్తి మేరకు సన్న బియ్యం సరఫరా కాకపోవడంతో డీలర్లు ఆయా దుకాణాలను మూసివేశారు. ఇలా ఒక్క మణికొండ మండలంలోనే కాదు.. జిల్లాలో మెజార్టీ మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ పథకం అమలు తీరుపై గురువారం 'సాక్షి' బృందం గ్రౌండ్ రిపోర్ట్ నిర్వహించింది.

### స్టాక్ లేక.. వచ్చిన వాళ్లకు సమాధానం చెప్పలేక..

సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీకి ముందే ఎంపిక చేసిన గోదాముల నుంచి చౌకధరల దుకాణాలకు బియ్యం, గోధుమలు, ఇతర నిత్యావసరాలు చేరుకుంటాయి. ఆయా షాపుల డీలర్లు ఉదయం, సాయంత్రం వేళల్లో షాపులు తెరిచి లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంటారు. సన్న బియ్యం పంపిణీ ప్రకటన, లబ్ధిదారుల నుంచి వస్తున్న ఒత్తిడితో మెజార్టీ షాపులు తెరుచుకోవడం లేదు. సన్న బియ్యం సంగతేమో కానీ, కనీసం దొడ్డు బియ్యం కూడా దక్కకుండా పోతున్నాయి. ఫలితంగా ఇంట్లో బియ్యం లేక పేదలు పస్తులుండాల్సి వస్తోంది. జిల్లాలో 936 రేషన్‌షాపులు ఉండగా, వీటి పరిధిలో 5,71,696 రేషన్‌కార్డులు, 18,71,696 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా ప్రభుత్వం 1,17,54,063 కిలోల బియ్యాన్ని సరఫరా చేస్తోంది. దొడ్డు బియ్యం స్థానంలో ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు తొలి విడతగా కొంత మొత్తాన్ని సరఫరా చేసింది. లబ్ధిదారుల నిష్పత్తి మేరకు సరఫరా కాకపోవడం.. ఇప్పటికే వచ్చిన బియ్యం పంపిణీ చేయడంతో రేషన్‌షాపులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం స్టాక్ లేకపోవడం.. లబ్ధిదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుండడంతో వచ్చిన వాళ్లకు సమాధానం చెప్పలేక డీలర్లు తలపట్టుకుంటున్నారు. కొంత మంది ఏకంగా షాపులు మూసేసి పత్తా లేకుండా పోతున్నారు. మరోవైపు మహేశ్వరం, కిస్మత్‌పూర్, శంషాబాద్, హయత్‌నగర్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, యాచారం, షాద్‌నగర్, శంకర్‌పల్లి గోదాముల నుంచి రేషన్‌షాపులకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాలో రెండు నుంచి మూడు కిలోలు తరుగు ఉండటం గమనార్హం.

### వెలవెలబోయిన దుకాణాలు

జిల్లా వ్యాప్తంగా వందకుపైగా దుకాణాల్లో బియ్యం నిల్వలు నిండుకున్నట్లు తేలింది. శంకర్‌పల్లి సహా జన్వాడ, సందేపల్లి రేషన్‌షాపులు ఖాళీగా ఉన్నాయి. మొయినాబాద్ మండలం చిలుకూరు-2 రేషన్ దుకాణాల్లో నిల్వలు ఖాళీ అయ్యాయి. కనకమామిడి, అప్పారెడ్డిగూడలోనూ ఇదే పరిస్థితి. చేవెళ్ల మండలం చేవెళ్ల-1,2 దుకాణాలతో పాటు కిష్టాపూర్, ఇబ్రహీంపల్లి, ఊరెళ్ల, ఆలూరు-2 రేషన్ షాపుల ముందు నో స్టాక్ బోర్డులు వెలిశాయి. శంషాబాద్ మండలం ఉట్‌పల్లి-1,2 షాపులు సహా పెద్దతూప్రా, చిన్నగోల్కొండ, చౌదరిగూడలోనూ స్టాక్ లేదు. మహేశ్వరం మండలం కేకే బస్తీ, మహేశ్వరం-1, తుక్కుగూడ, దిల్వార్‌గూడ, హబీబుల్లాగూడ దుకాణాల్లోనూ నిల్వలు అయిపోయాయి. ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ సహా మంచాల మండలం ఆరుట్ల-2లోనూ నిల్వలు నిండుకున్నాయి. యాచారం మండలం గండ్లగూడ, మొగుళ్లవంపు, నక్కర్త రేషన్ షాపులు ఖాళీ అయ్యాయి. కందుకూరు మండలం జైత్వారం, రాచలూరు, కందుకూరు ఎక్స్‌రోడ్ సహా షాద్‌నగర్‌లోని ఏ ఒక్క షాపులోనూ నిల్వలు లేవు. ఫరూఖ్ నగర్ మండలంలోని చటాన్‌పల్లి, పీర్లగూడ సహా కేశంపేటలోని వార్డు నంబర్ 1లోని షాపు, ఎస్సీ కాలనీలోని షాపులోనూ ఇదే పరిస్థితి. సరూర్‌నగర్‌లోని వనస్థలిపురం కాంప్లెక్స్, సీబీఐ కాలనీ, ఎస్‌బీహెచ్‌కాలనీ, లింగోజిగూడ, ఎల్బీనగర్, జీజేనగర్, ఎర్రకుంట, హయత్‌నగర్ ఓల్డ్ విలేజ్, లెక్చరర్స్ కాలనీ, రాజిరెడ్డినగర్, వాంబేకాలనీ, నందనవనం, సరస్వతినగర్, వినాయకనగర్, బీఎస్‌రెడ్డి నగర్, ఆమనగల్, గిరికొత్తపల్లి, కలకొండ, తట్టిఅన్నారం, మరిపల్లి, అబ్దుల్లాపూర్, తుర్కయంజాల్, రాగన్నగూడ, ఇంజాపూర్, కమ్మగూడ, మునగనుర్, బ్రాహ్మణపల్లి, లస్కర్‌గూడ, కొత్తగూడెం, కుంట్లూరు రాజీవ్‌గృహకల్ప దుకాణాలు సైతం నిల్వలు లేక వెలవెలబోయాయి. ఇప్పటికే పంపిణీ చేసిన బియ్యంలోనూ నూకల శాతం ఎక్కువగా ఉన్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు.



గిరిజన రైతులతో మాట్లాడుతున్న గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు

# సార్.. న్యాయం చేయండి

**పల్లెచెల్కతండా గిరిజనుల ఆందోళన**

**యాచారం:** 'సార్ మాకు న్యాయం చేయండి.. ఏళ్లుగా ఆ భూములనే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాం.. సర్కార్ నుంచి పైసా పరిహారానికి నోచుకోలేదు.. అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేదు.. మీరైనా ఆదుకోండి' అంటూ కడ్తాల్ మండలం పల్లెచెల్కతండా గిరిజనులు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల సర్వే, ఫెన్సింగ్ నిర్మాణంలో భాగంగా ఆరోరోజు గురువారం నక్కర్తమేడిపల్లి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 184లో పనులు కొనసాగాయి. ఈ సందర్భంగా పల్లెచెల్కతండాకు చెందిన రైతులు పనుల వద్దకు వచ్చి ఆందోళన నిర్వహించారు. పరిహారం అందే వరకు సర్వే, ఫెన్సింగ్ పనులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. యాచారం తహసీల్దార్ అయ్యప్పను అక్కడికి రప్పించి గిరిజనుల గోడు వినిపించారు. కలెక్టర్, టీజీఐఐసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### అసత్య ప్రచారం నమ్మొద్దు

**హయత్‌నగర్:** తమపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారని బీఆర్‌ఎస్ అనుకూల డైరెక్టర్‌లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిలో ఏమాత్రం వాస్తవం లేదని నల్లగొండ రంగారెడ్డి పాల ఉత్పత్తుదారుల సమాఖ్య (నార్ముల్ మదర్‌డెయిరీ) చైర్మన్ మధుసూదన్‌రెడ్డితోపాటు పలువురు డైరెక్టర్లు స్పష్టం చేశారు. హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మదర్ డెయిరీ ఎదుర్కొంటున్న కష్టాలను గట్టెక్కించే ప్రయత్నంలో భాగంగా ఎమ్మెల్యే ఐలయ్య ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని కలవాలని సమావేశం అయ్యామని తెలిపారు. దానిని వక్రీకరించి అవిశ్వాసం పెట్టేందుకు సమావేశం అయినట్లు తప్పుడు ప్రచారం చేసి తప్పుడు వార్తలు రాయించారని ఆరోపించారు. రైతుల బకాయిలు తీర్చేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందేందుకు సీఎంను కలిసి పరిస్థితిని వివరిస్తామని పేర్కొన్నారు. పాడి రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని, బకాయిల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని అన్నారు. కలసికట్టుగా డెయిరీని రక్షించుకుంటామని, రైతులు ఎలాంటి పుకార్లు నమ్మొద్దని కోరారు. సమావేశంలో డైరెక్టర్‌లు మండడి ప్రభాకర్, కల్లెపల్లి శ్రీశైలం, గొల్లపల్లి రాంరెడ్డి, మండల జంగయ్య, గూడూరి శ్రీధర్‌రెడ్డి, పుష్పాల నర్సింహులు, అగ్గాల నర్సింహారెడ్డి, బత్తుల నరేందర్ పాల్గొన్నారు.

# శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు

**వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్**



సమావేశంలో మాట్లాడుతున్న రావినూతల శశిధర్

**మీర్‌పేట:** 27 కిలో మీటర్లు, లక్షలాది మందితో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వీర హనుమాన్ శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డా.రావినూతల శశిధర్ తెలిపారు. ఈ నెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మందమల్లమ్మ చౌరస్తాలోని చంద్రా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 8 గంటలకు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయం నుంచి శ్రీ వీర హనుమాన్ విజయయాత్ర ప్రారంభమై కోఠి మీదుగా తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. నగరంలోని అన్ని ఆధ్యాత్మిక ధార్మిక సంస్థలు పాల్గొనే ఈ యాత్రలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వలంటీర్లు ప్రసాదం, తాగునీరు అందిస్తారన్నారు. అధిక సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తూము పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి సుధాకర్, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ నవారు రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కేసని గణేశ్, ఉప్పల సంజయ్, గురువయ్య, మీడియా ఇన్‌చార్జి ఎస్.బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**అనుదీప్ దురిశెట్టి**

**లక్డీకాపూల్:** జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని, చికిత్సలు అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణుల (జనన పూర్వ సంరక్షణ) సేవలను మెరుగుపరచాలని, వారి ఆరోగ్యంపై ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఫాలోఅప్ చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కాన్పు సమయాల్లో ఇబ్బంది కలగకుండా, తల్లీబిడ్డలు క్షేమంగా ఉండేలా వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే కాన్పు కోసం రిఫరల్ ఆస్పత్రికి పంపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జయమాలిని, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుచేతన, గాంధీ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవతి, ఎస్‌పీహెచ్‌ఓలు, మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కార్యకర్తల పార్టీ బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

**శంకర్‌పల్లి:** భారతీయ జనతా పార్టీ లీడర్ల పార్టీ కాదని, కార్యకర్తల పార్టీ అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పట్టణంలోని బీడీఎల్ చౌరస్తా వద్ద గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మండల, మున్సిపల్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ఎప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసమే ఆలోచిస్తుందని, మిగతా పార్టీల్లా మీడియాలో కనిపించేందుకు ఆసక్తి చూపించదని అన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఎన్నో నిధులు కేటాయిస్తున్నప్పటికీ శిలాఫలకాలు వేసుకొని క్రెడిట్ మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటోందని విమర్శించారు. కార్యకర్తలు గ్రామస్థాయిలో ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జిలు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాష్, శంకర్‌పల్లి మండల అధ్యక్షురాలు లీలావతి, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం పట్టని ప్రభుత్వం



పోస్టర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

**మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**షాద్‌నగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాల పూర్తయిన సందర్భంగా హనుమకొండలో నిర్వహించే రజతోత్సవ మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం షాద్‌నగర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీళ్లుగా మారిన పంట పొలాలను నాడు కేసీఆర్ సస్యశ్యామలం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కరువు తాండవిస్తోందని, కాంగ్రెస్ పాలనలో తిరిగి పాత రోజులు వస్తాయేమోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పిన మాయమాటలకు మోసపోయి, భ్రమపడి ఆ పార్టీకి ఓటు వేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతల మాటలకు మోసపోయామని ప్రజలు ఎంతో బాధపడుతున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కేసులకు భయపడేది లేదని, ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈనెల 27న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొందూటి నరేందర్, ఈట గణేశ్, రాజావరప్రసాద్, వంకాయల నారాయణరెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, యుగేంధర్, ఒగ్గు కిషోర్, వెంకట్‌రాంరెడ్డి, ఎంఎస్ నట్‌రాజ్, బచ్చలి నర్సింహ పాల్గొన్నారు.

# బుల్లెట్ తీసి బతికించారు..

**రెండు నెలలకు పైగా తలలో బుల్లెట్**

- గచ్చిబౌలి కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స
- 3.5 సెంటీ మీటర్ల బుల్లెట్‌ను బయటకు తీసిన కేర్ వైద్యులు
- సురక్షితంగా బయటపడ్డ సోమాలియా యువకుడు



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు

గచ్చిబౌలి: సోమాలియా దేశంలో జరిగిన సివిల్ వార్‌లో ఓ యువకుడికి తలలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. కోమాలోకి వెళ్లిన యుకుడికి బుల్లెట్‌ను తీసేందుకు అక్కడి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రెండు నెలల అనంతరం రోగిని ఎయిర్ అంబులెన్స్‌లో గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. 12 గంటల పాటు శస్త్ర చికిత్స చేసిన కేర్ హాస్పిటల్ డాక్టర్ల బృందం 3.5 సెంటీ మీటర్ల పొడవు ఉన్న బుల్లెట్‌ను బయటకు తీసింది. దీంతో సదరు యువకుడు గులెమ్ మహముద్ హెర్సీ(27) ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. గురువారం కేర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు వివరాలు వెల్లడించారు. సోమాలియాకు చెందిన గులెమ్ మహమూద్ హెర్సీ అనే యువకుడికి అక్కడ జరిగిన సివిల్ వార్‌లో నుదుటి నుంచి బుల్లెట్ తలలోకి దూసుకెళ్లిందన్నారు. చిన్న మెదడు దగ్గర చేరడంతో అతడు కోమాలోకి వెళ్లాడని, అక్కడి వైద్యులు తల ముందు పుర్రె ముందు భాగం నుంచి బుల్లెట్‌ను తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. కోమాలోంచి కొద్దిగా కోలుకున్న తర్వాత అతడిని రెండు నెలల అనంతరం ఎయిర్ అంబులెన్స్‌లో గచ్చిబౌలి కేర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారన్నారు. రేడియాలజీ, సిటీస్కాన్, ఎంఆర్ఐలో బుల్లెట్ పొజిషన్, లోకేషన్‌ను గుర్తించామన్నారు. న్యూరో నావిగేషన్, సర్జికల్ మైక్రో స్కోప్ ద్వారా బ్రెయిన్ ఫంక్షన్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా 12 గంటల పాటు ఆపరేషన్ చేసి బ్లీడింగ్ కాకుండా, వైటల్ స్ట్రక్చర్స్‌ను కాపాడుకుంటూ బుల్లెట్‌ను తీశామన్నారు. బ్రెయిన్ స్టెంట్ దగ్గర ఉన్న బుల్లెట్‌ను బయకు తీయడం చాలా అరుదుగా జరుగుతుంటుందన్నారు. సర్జరీ జరిగి రెండు వారాలు గడిచిందని, రోగి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. అతడిని రిహాబిలిటేషన్ సెంటర్ ఉంచామని, మరో నాలుగు వారాలు గడిస్తే మరింత కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. కేర్ హాస్పిటల్స్ సీఈఓ నీలేష్ మాట్లాడుతూ ఇలాంటి క్లిష్టమైన కేసులకు అత్యాధునిక వైద్య సదుపాయాలు , నిపుణులైన వైద్యులు తమ వద్ద ఉన్నారని తెలిపారు. ఆఫ్రికా, దక్షిణ ఆసియా దేశాల నుంచి వచ్చే అంతర్జాతీయ రోగులకు గమ్యస్థానంగా కేర్ హాస్పిటల్ ఉందన్నారు.

## 15న స్త్రీ సమ్మిట్ 2.0

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మహిళల భద్రతను మరింత పెంచడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో (హెచ్‌సీఎస్‌సీ) కలిసి సిటీ పోలీసులు 'స్త్రీ' (షీ ట్రంప్స్ థ్రూ రెస్పెక్ట్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్) పేరుతో మరోసారి సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 2023లో ఓసారి ఈ సదస్సు నిర్వహించారు. ఈ నెల 15న నిర్వహించనున్న రెండో సమ్మిట్‌కు సంబంధించిన లోగోను కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ వర్గాలకు చెందిన మహిళలు, యువతులతో పాటు నిపుణులు ఈ సమ్మేళనంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు సలహాలు, సూచనలు ఇస్తారు.

# అసాంఘిక అడ్డాగా.. ఫాంహౌస్‌లు

- మందు, రేవ్, ముజ్రా పార్టీలతో గలీజు దందా
- అద్దెకు తీసుకుని గుట్టుగా నడుపుతున్న నిర్వాహకులు
- దాడులు చేసి గుట్టురట్టు చేస్తున్న ఎస్‌ఓటీ పోలీసులు

మొయినాబాద్: వారాంతపు సరదా కోసం నిర్మించుకుంటున్న ఫాంహౌస్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. వాటిల్లో మందు, రేవ్, ముజ్రా పార్టీలతోపాటు వ్యభిచారం వంటి గలీజు దందాలు జరుగుతున్నాయి. అప్పుడప్పుడు ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి గుట్టు రట్టుచేస్తున్నా ఈ దందాలు మాత్రం ఆగడంలేదు. హైదరాబాద్ మహానగర శివారుల్లోని మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో చాలా మంది ఫాంహౌస్‌లు నిర్మించుకుంటున్నారు. 111 జీఓ పరిధిలో ఉన్న మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్ ప్రాంతాల్లో ఇవి మరీ ఎక్కువగా ఉన్నాయి. ఒక్క మొయినాబాద్ మండలంలోనే సుమారు వెయ్యికి పైగా ఫాంహౌస్‌లున్నాయి. ఇక్కడ నిత్యం గలీజు దందాలు జరుగుతున్నా అరికట్టడంలో స్థానిక పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారు.

### నిర్వాహకుల అడ్డగోలు దందాలు

ఫాంహౌస్‌లను అద్దెకు తీసుకున్న నిర్వాహకులు వాటిలో అడ్డగోలు దందాలు చేస్తున్నారు. గెట్‌టూగెదర్, ఫ్యామిలీ, బర్త్‌డేలు అంటూ రోజువారీగా అద్దెకు ఇస్తున్నారు. వీటితోపాటు రేవ్, ముజ్రా పార్టీలు, పేకాట, కోడి పందేలు సైతం నిర్వహిస్తున్నారు. ఫాంహౌస్‌లకు వచ్చే యువకులను ఆకర్షించే విధంగా ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారం కూడా చేయిస్తున్నారు. మొయినాబాద్‌లోని కనకమామిడి, చాకలిగూడ, సురంగల్, నజీబ్‌నగర్, శ్రీరాంనగర్, తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, అప్పారెడ్డిగూడ, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, రెడ్డిపల్లి, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారం, అమ్డాపూర్ తదితర గ్రామాల పరిధిలో ఉన్న ఫాంహౌస్‌లలో ఈ దందాలు జోరుగా కొనసాగుతున్నాయి.



ఎత్‌బార్‌పల్లిలో ముజ్రా పార్టీ నిర్వహించిన ఫాంహౌస్

### మామూళ్ల మత్తులో స్థానిక పోలీసులు

నిత్యం ఫాంహౌస్‌ల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా స్థానిక పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వీటి నుంచి ప్రతి నెలా మామూళ్లు అందుతున్నట్లు తెలుస్తుంది. ఒక్కో ఫాంహౌస్ నుంచి నెలకు సుమారు రూ.20–30 వేల వరకు ముడుతున్నట్లు సమాచారం. మామూళ్ల మత్తులో జోగుతున్న పోలీసులు ఫాంహౌస్‌లలో జరుగుతున్న గలీజు దందాలకు పరోక్షంగా సహకరిస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుంది. వీటిపై అప్పుడప్పుడు ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి ముజ్రా, రేవ్ పార్టీలు, వ్యభిచారం, పేకాట, కోడి పందేల వంటి అసాంఘిక కార్యకలాపాలను భగ్నం చేస్తున్నారు. ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసే వరకు స్థానిక పోలీసులు ఏం చేస్తున్నారంటూ మొయినాబాద్ ఎస్‌హెచ్‌ఓపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం సైతం వ్యక్తం చేశారు.

**“తనిఖీలు నిర్వహిస్తున్నాం**



ప్రతి శుక్రవారం, శనివారం ఫాంహౌస్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అనుమతి లేకుండా పార్టీలు నిర్వహించినా, మద్యం వినియోగించినా కేసులు నమోదు చేస్తున్నాం. అప్పుడప్పుడు బర్త్‌డే, గెట్‌టూగెదర్ పార్టీల పేరుతో అప్పుడప్పుడు ఇతర పార్టీలు నిర్వహిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే నిర్వాహకులు, ఫాంహౌస్‌ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

### వెలుగుచూసిన ఘటనలు

- ఏడాదిన్నర క్రితం కనకమామిడి రెవెన్యూలోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులతో పాటు నలుగురిని(ఇద్దరు మహిళలు) ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.
- కనకమామిడి రెవెన్యూ పరిధిలోని ఓ ఫాంహౌస్‌లో ఏడాది క్రితం వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఇద్దరు నిర్వాహకులు, నలుగురు విటులు, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.
- ఆరు నెలల క్రితం అజీజ్‌నగర్ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు.
- రెండు నెలల క్రితం తోలుకట్ట రెవెన్యూలో ఓ ఎమ్మెల్సీకి చెందిన ఫాంహౌస్‌లో కోడిపందేలు నిర్వహిస్తుండగా ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి భగ్నం చేశారు. పందేల నిర్వాహకుడితోపాటు 64 మంది పట్టుకున్నారు. భారీగా మద్యం, నగదు, క్యాసినో కాయిన్స్, కోడికత్తులు, కార్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
- తాజాగా మంగళవారం అర్ధరాత్రి ఎత్‌బార్‌పల్లిలోని ఫాంహౌస్‌లో బర్త్‌డే పార్టీ పేరుతో నిర్వహిస్తున్న ముజ్రా పార్టీని ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి భగ్నం చేశారు. 13 మంది యువకులు, 7 మంది యువతులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి, హుక్కా పాట్స్, మద్యం, నగదు స్వాధీనం చేసుకున్నారు.

## యువతి అదృశ్యంపై ఫిర్యాదు



కళావతి (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం .. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మర్ల కృష్ణ కుమార్తె కళావతి(19) ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 9న మధ్యాహ్నం బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుంది. ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. మన్సూర్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ కృష్ణ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. యువతి ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## వివాద భూమిలో సెక్షన్ 164 విధింపు

ఆర్డీఓ సూచనతో తహసీల్దార్ ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

తుర్కయంజాల్: ఇరువర్గాల ఘర్షణతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న కమ్మగూడ, తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలో బీఎన్ఎస్ఎస్ కింద సెక్షన్ 164 అమలు చేయాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కె.అనంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. గురువారం స్థానిక కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 240, 241, 242లోని 10.09 ఎకరాల భూమి తమదంటే తమదేనని ఇరు వర్గాలు వరుసగా గొడవలకు దిగుతుండటంతో బుధవారం లా అండ్ ఆర్డర్ అదుపు తప్పినట్లు గుర్తించామని చెప్పారు. ఇలాంటి సంఘటనలు మరోసారి చోటు చేసుకునే ప్రమాదం పొంచి ఉండటంతో సెక్షన్ 164 విధించినట్లు ఆయన తెలిపారు. ప్లాట్లు, భూమి యజమానులతో పాటు, కోర్టు నుంచి ఆర్డర్ పొందిన వారు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించారు. దీన్ని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్మినేడులో వడగళ్ల వాన

ఇబ్రహీంపట్నం రూరల్: ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో కురిసింది. భారీ ఉరుములతో వడగళ్లు పడగా.. ఓ ఇంటిపై పిడుగుపడి రేయిలింగ్ కూలిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

## గంజాయి విక్రేత అరెస్టు



నిందితుడు షేక్ జకీర్

అత్తాపూర్: నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన షేక్ జకీర్(42) మహారాష్ట్రలోని అమరావతి నుంచి నిషేధిత గంజాయిని కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నాడు. ఈ నెల 8న మధ్యాహ్నం హసన్‌నగర్‌లో గంజాయిని తీసుకొచ్చి అవసరం ఉన్న వారికి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకొని అతడి నుంచి 1012 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.



## పోలీసులను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

యాచారం: విధుల్లో ఉన్న పోలీసులను బెదిరించిన వ్యక్తిపై యాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన కుంటి శ్రీకాంత్ బుధవారం అర్ధరాత్రి గునుగల్ గేట్ వద్ద సిగరేట్ కాల్చుతూ అనుమానంగా తిరుగుతున్నాడు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వెళ్లి అతడిని విచారిస్తుండగానే తీవ్ర పదజాలంతో దూషిస్తూ బెదిరించాడు. అక్కడి నుంచి తప్పించుకొనిపోయి, ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. ఈ విషయమై యాచారం పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

## మతిస్థిమితం లేని యువతి అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: మతిస్థిమితం లేని ఓ యువతి అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాదర్‌గుల్ ప్రాంతానికి చెందిన బొచ్చల్ల సౌందర్య(24) అనే యువతి ఇంట్లో నుంచి తప్పిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదిబట్ల పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

## అంతర్రాష్ట్ర మద్యాన్ని సరఫరా చేసే బెడ్ రోలర్ అరెస్ట్


నాంపల్లి: అంతరాష్ట్ర మద్యాన్ని నగరానికి దిగుమతి చేసే వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా గురువారం హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో సోదాలు జరిపారు. ప్లాట్‌ఫారం నెం-6 మీద బ్యాగ్‌తో రైళ్లలో పనిచేసే ఒక బెడ్ రోలర్ వేచి ఉండటాన్ని గమనించారు. అడ్డగించి బ్యాగు తెరి చూడగా అందులో వివిధ బ్రాండ్లకు చెందిన మద్యం బాటిల్స్ కనిపించాయి. ఈ మద్యాన్ని హరియాణా నుంచి హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లుగా బెడ్ రోలర్ ఒప్పుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అమానిగంజ్ చోఁప్, ఫైజాబాద్‌కు చెందిన రామ్ సరన్ కుమారుడు శివ 'జైపూర్–హైదరాబాద్'నగరాల మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో బెడ్ షీట్లను మార్చే బెడ్ రోలర్‌గా పనిచేస్తున్నారు. అతను ఓ కాంట్రాక్టర్ కింద రైళ్లలో బెడ్ షీట్స్‌ను శుభ్రం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. హరియాణాలో తక్కువ ధరకు లభించే బ్లెండర్స్ ప్రైడ్-18 బాటిల్స్, 8 పీఎం-10 విస్కీ బాటిల్స్‌ను హైదరాబాద్‌కు రైలులో తీసుకువచ్చాడు. వీటి విలువ సుమారు రూ.32,160 గా ఉంటుందని హైదరాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అంతర్రాష్ట్రానికి చెందిన మద్యాన్ని సరఫరా చేసేందుకు అతడి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## కత్తిపోట్లకు గురైన గిరిజన మహిళ మృతి

నాగోలు: మూడు రోజుల క్రితం కత్తిపోట్లకు గురైన వర్ష్య లక్ష్మి అనే గిరిజన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 8న రాత్రి సరూర్‌నగర్ పోస్టాఫీస్‌కు వెళ్లే దారిలో ఉన్న రిషి కిచెన్ వెను మరి కొందరు మహిళతో కలిసి ఆమె వేచి ఉంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి లక్ష్మిపై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడిన ఆమెను దిల్‌సుఖ్‌నగర్‌లోని కృతిక హాస్పిటకు తరలించారు. హాస్పిటల్‌లో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత లక్ష్మి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

లింగోజిగూడ: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12 నిర్వహించనున్న ర్యాలీ సన్నాహక సమావేశం గురువారం కర్మన్‌ఘాట్‌లోని లక్ష్మీకన్వెన్షన్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిదిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ... ర్యాలీ రోజు ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ ఉందని సిబ్బంది అక్కడికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. నిర్వాహకులు ఎలాంటి సంఘటనలు జరగకుండా కొంతమంది వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ర్యాలీ సమయంలో రోడ్డు మొత్తం వెళ్లకుండా ఒకవైపు నుంచి మాత్రమే వెళ్లేలా చూసుకోవాలన్నారు. ర్యాలీలో భారీ శబ్దాలు వచ్చే వాహనాలను వాడకుండా చూడాలని సూచించారు. నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు నెలకొన్నా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# శిఖం భూమిలో నిర్మాణాలు

**రాత్రిపూట పనులు చేస్తున్న అక్రమార్కులు**



జల్‌పల్లి చెరువు శిఖం భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. 69 సర్వే నంబర్ పరిధిలోకి వచ్చే ఈ భూమిపై ఎప్పటి నుంచో కన్నేసిన కబ్జాదారులు గతంలో ప్రహరీలు నిర్మించేందుకు యత్నించారు. అప్పట్లో బాలాపూర్ రెవెన్యూ అధికారులు స్పందించి కూల్చివేతలు చేపట్టారు. తాజాగా సెలవులు రావడంతో ఇదే అదునుగా భావించి మూడు భారీ ప్రహరీల నిర్మాణ పనులు చేపడుతున్నారు. రాత్రికి రాత్రే ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. చెరువులో నీరు తగ్గుముఖం పడుతున్నప్పుడు ఇలాంటి నిర్మాణాలు చేపట్టి, చివరకు తటాకం నిండినప్పుడు తమ నిర్మాణాలు మునిగిపోయాయంటూ గగ్గోలు పెట్టడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఉస్మాన్‌నగర్‌లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమై, ప్రజావసరాల కోసం ఏదైనా కమ్యూనిటీ హాల్, క్రీడా మైదానం లాంటివి నిర్మించడానికి కూడా స్థలం దొరకని పరిస్థితులు జల్‌పల్లి మున్సిపాలిటీలో దాపురించాయి. అక్కడక్కడ మిగిలిన కొద్దిపాటి ప్రభుత్వ భూములనైనా కబ్జా బారిన పడకుండా రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇంట్లో పేలిన సిలిండర్

**తప్పిన పెను ప్రమాదం**



ఇంట్లో కాలిపోయిన సామగ్రి

పహాడీషరీఫ్: స్టోర్ రూంలో ఉంచిన సిలిండర్ పేలిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎర్రకుంట సాదత్‌నగర్‌కు చెందిన సల్మా భాను కుటుంబంతో కలిసి నివాసం ఉంటుంది. బుక్ చేసిన గ్యాస్ రావడంతో ఇంటి బాల్కానీలో ఉన్న విజిటింగ్ రూమ్‌లో ఉంచారు. ఆ సమయంలో పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో సల్మా లోపలి ఇంట్లో ఉంది. అప్పటికే లీకవుతున్న గ్యాస్ ఒక్కసారిగా పేలింది. దీంతో ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేని కారణంగా పెను ప్రమాదమే తప్పింది. ఇంటి పైకప్పు కూడా స్వల్పంగా ధ్వంసమయింది.

# మరోసారి రణరంగం

- శాంతి భద్రతలకు విఘాతంగా పిట్టలగూడ భూవివాదాలు
- పెద్దఎత్తున గుమిగూడి కర్రలతో కొట్టుకున్న ఇరువర్గాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఘటనా స్థలంలో గుమిగూడిన జనాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పిట్టలగూడలోని భూములు వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. నిజాం నవాబుల హయాంలో నక్కలోళ్లు, పిట్టలోళ్లకు ఇనామ్ కింద ఇచ్చిన వందల ఎకరాల భూముల విషయంలో తరచూ నెలకొంటున్న వివాదాలు శాంతి భద్రతలకు విఘాతంగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ భూములలో బుధవారం సాయంత్రం రెండు గ్రూప్‌లు పెద్ద ఎత్తున గుమిగూడి బాహాబాహీకి దిగారు. కర్రలు, పైపులు, చేతికి దొరికిందానితో ఆడ, మగ అని తేడా లేకుండా దాడులు చేసుకొని ఈ ప్రాంతాన్ని రణరంగంగా మార్చారు. దాడికి పాల్పడిన వారిపై పహాడీషరీఫ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### ఒకే ప్లాటు పలువురికి విక్రయాలు

జల్‌పల్లి నుంచి గగన్‌పహాడ్‌కు వెళ్లే రూట్‌లో ఉన్న పిట్టలగూడెంలో రోడ్డుకు ఎడమవైపు ఉన్న సమాధుల స్థలాన్ని ఇప్పటికే పెద్ద ఎత్తున విక్రయాలు చేపట్టారు. పార్టీ కులస్తులలోని కొందరు నాయకులుగా చలామణి అవుతూ గ్రూప్‌లుగా విడిపోయి ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. ఒక గ్రూప్ విక్రయించిన భూమిని కొన్నవారు పొజిషన్‌లోకి వచ్చాక, మరో గ్రూప్ రంగంలోకి దిగుతుంది. ఈ భూమి తమదంటూ, మీకంటే ముందే తాము కొనుగోలు చేశామంటూ గొడవలకు దిగుతుంటారు. చివరకు పోలీస్‌స్టేషన్, కోర్టుల దాక వెళుతున్నారు. గత రెండు నెలల క్రితం ఇదే వివాదాస్పద భూమిలో రాత్రికి రాత్రే పెద్ద ఎత్తున ప్రీ కాస్ట్ వాల్‌ను నిర్మించారు. ఈ స్థలం తమదంటూ బుధవారం సాయంత్రం అక్కడికి చేరుకున్న 40-50 మంది వాల్‌ను కూల్చివేయడంతో గొడవ మొదలయ్యింది.

### మాయమవుతున్న సమాధులు

రోడ్డుకు ఎడమవైపు పెద్ద ఎత్తున ఉన్న స్థలాన్ని సమాధులతో సహా కొంత మంది విక్రయాలు చేపడుతున్నారు. ఈ స్థలాలను కొనుగోలు చేసిన వారు వెంటనే చుట్టూ ప్రహరీ నిర్మించుకోవడం... ఆపై లోపల ఉన్న సమాధులను తొలగించి, భూమిని చదును చేసి ప్లాట్లుగా మార్చి విక్రయాలు జరుపుతున్నారు. ఇలా వందల గోరీలు ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయాయి. ప్రతి ఏటా నక్కల పిట్టలోళ్లు తమ పూర్వీకుల సమాధులకు హోలీ సందర్భంగా నగరం నలుమూలల నుంచి తరలివచ్చి పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తారు. సమాధులను అంత పవిత్రంగా చూసుకునే సంప్రదాయం ఉన్నప్పటికీ, కొందరు స్వార్థపూరితంగా వాటిని అమ్ముకోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక తరచూ కొనసాగుతున్న వీరి గొడవలతో తమ గ్రామానికి చెడ్డ పేరు వస్తుందని జల్‌పల్లి గ్రామస్తులు మండిపడుతున్నారు. సమగ్ర విచారణ జరిపి ఘర్షణ వాతావరణం లేకుండా చూడాలని పోలీసులను కోరుతున్నారు.



వివాదాస్పదంగా మారిన సమాధులు ఇవే



కర్రతో దాడికి యత్నిస్తున్న యువకుడు